RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 167 | జులై 18 శనివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 167 | July 18 Saturday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ ఆర్కైవ్స్ 2

## భారత రైల్వే రంగంలో సరికొత్త విప్లవం

### పట్టాలెక్కిన దేశపు తొలి హైడ్రోజన్ రైలు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

భారతీయ రైల్వే చరిత్రలో పర్యావరణహిత ప్రయాణానికి సరికొత్త బాటలు వేస్తూ దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత రైలు విజయవంతంగా ప్రారంభమైంది. సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన ఈ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. హరియాణాలోని జింద్ – సోనిపట్ మధ్య గల 89 కిలోమీటర్ల మార్గంలో ఉత్తర రైల్వే పరిధిలో ప్రయోగాత్మకంగా ఈ సేవలను అందుబాటులోకి తెచ్చారు. సంప్రదాయ డీజిల్ ఇంజిన్లకు ప్రత్యామ్నాయంగా, పర్యావరణ కాలుష్యాన్ని పూర్తిగా నివారించే ఉద్దేశంతో ఈ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ సాంకేతికతను భారత రైల్వే రంగంలోకి ప్రవేశపెట్టారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో ప్రపంచవ్యాప్తంగా హైడ్రోజన్ రైలు సాంకేతికతను కలిగి ఉన్న అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు విజయవంతమైతే కల్కా–శిమ్లా వంటి సాంస్కృతిక వారసత్వ రైల్వే మార్గాలతో పాటు దేశంలోని మరిన్ని రూట్లలో ఈ సేవలను విస్తరించాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాధారణ విద్యుత్ రైళ్లు పైన ఉండే కరెంట్ తీగల నుంచి శక్తిని పొందితే, డీజిల్ రైళ్లు ఇంధనాన్ని మండించడం ద్వారా నడుస్తాయి. కానీ, ఈ సరికొత్త హైడ్రోజన్ రైలు ప్రత్యేకత ఏమిటంటే ఇది తన ప్రయాణానికి కావాల్సిన విద్యుత్‌ను సొంతంగానే తయారు చేసుకుంటుంది. ఇందుకోసం రైలులో 'ప్రోటాన్ ఎక్స్ఛేంజ్ మెంబ్రేన్ ఫ్యూయెల్ సెల్' అనే లఘు విద్యుత్ కేంద్రాన్ని అమర్చారు. రైలు మోసుకెళ్లే ట్యాంకుల్లోని హైడ్రోజన్‌కు, వాతావరణం నుండి సేకరించిన ఆక్సిజన్‌కు మధ్య 1,200 కిలోవాట్ల సామర్థ్యం గల ఫ్యూయెల్ సెల్‌లో రసాయన ప్రక్రియ జరిగి కరెంట్ ఉత్పత్తి అవుతుంది. ఈ విద్యుత్ సాయంతో ట్రాక్షన్ మోటార్లు పనిచేసి రైలు చక్రాలు కదులుతాయి. దాదాపు 3,200 హార్స్ పవర్ (హ్రా) ప్రొపల్షన్ వ్యవస్థతో రూపొందిన ఈ రైలు, ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన హైడ్రోజన్ రైళ్లలో ఒకటిగా నిలిచింది. గంటకు 75 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ రైలులో మొత్తం 10 కోచ్‌లు ఉండగా, ఒకేసారి

మిగతా 2వ పేజిలో..

## ప్రయాణికుల్లో వర్గ విభజన సరికాదు

### 'రెండో తరగతి' కేవలం కోచ్‌లకే పరిమితం కావాలన్న సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

రైల్వే ప్రయాణికుల ఆత్మగౌరవం, భద్రత మరియు ప్రమాద పరిహారానికి సంబంధించి సుప్రీంకోర్టు అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేసింది. రైలు ప్రయాణికులను ఇకపై ఎట్టి పరిస్థితుల్లోనూ 'రెండవ తరగతి (సెకండ్ క్లాస్) ప్రయాణికులు' అని సంబోధించవద్దని రైల్వే శాఖను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. 'క్లాస్' లేదా 'తరగతి' అనే విభజన కేవలం రైలు కోచ్‌ల గుర్తింపునకు మాత్రమే పరిమితం కావాలని, మనుషులకు కాదని జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది.

మిగతా 2వ పేజిలో..

## ఆంధ్రప్రదేశ్‌లో 12 కొవిడ్ కేసులు నమోదు

### ప్రజలు ఆందోళన చెందవద్దని వైద్య ఆరోగ్యశాఖ వెల్లడి

**అమరావతి జనసంఘర్షణ**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొవిడ్ కేసులు మళ్లీ చెదురుమొదురుగా వెలుగుచూశాయి. జూన్ 26 నుంచి జులై 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12 మందికి కొవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈ కేసులన్నీ ఒకేచోట కాకుండా రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లోని వేర్వేరు ప్రాంతాల్లో నమోదయ్యాయి. ఇందులో అత్యధికంగా కడప జిల్లాలో 8 కేసులు నమోదు కాగా, గుంటూరులో రెండు, విశాఖపట్నం

మిగతా 2వ పేజిలో..

## ఒకే వేదికపై 191 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

### తెలంగాణ దేవాదాయ శాఖలో చారిత్రాత్మక ఘట్టం: అందజేసిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ చరిత్రలో ముందెన్నడూ లేని విధంగా ఒకేసారి భారీ సంఖ్యలో మతపరమైన ఉద్యోగాల నియామకం చేపట్టి సరికొత్త రికార్డు సృష్టించారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని, ఎంపికైన 191 మంది ఉద్యోగులకు నియామక ఉత్తర్వులను స్వయంగా అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 47 ప్రముఖ ఆలయాలకు ఎంపికైన అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, దేవాలయ వంట సిబ్బందితో పాటు మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం వంటి సాంప్రదాయ మంగళ వాయిద్య కళాకారులు ఈ నియామక పత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు. దేవాదాయ శాఖలో

మిగతా 2వ పేజిలో..

## ధరణి అక్రమాలపై 'సిట్'

### తెలంగాణ క్యాబినెట్ సంచలన నిర్ణయాలు: , పంచాయతీ నిధుల నిబంధనల సవరణ

**హైదరాబాద్ జనసంఘర్షణ**



తెలంగాణ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, పరిపాలన సంస్కరణలు, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. సచివాలయంలో దాదాపు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో.. ధరణి పోర్టల్ వివాదాలు, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల స్వయంప్రతిపత్తి వంటి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చించి కీలక తీర్మానాలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని క్యాబినెట్ గట్టి నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా వివిధ శాఖల అధికారులు, సాంకేతిక నిపుణులతో కూడిన ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయనున్నారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు జరిగిన భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపై ఈ 'సిట్' లోతుగా విచారణ జరపనుంది. అంతేకాకుండా, ధరణి లావాదేవీలపై పూర్తిస్థాయి 'ఫోరెన్సిక్ ఆడిట్' నిర్వహణకు కూడా మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఈ అక్రమాల్లో భాగస్వాములైన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే నాటి ఉన్నతాధికారులకు, బాధ్యులకు నోటీసులు జారీ చేసి, అక్రమంగా లబ్ధి పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని, ఇందుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులను స్వీకరించి పత్రాలను పరిశీలించాలని నిర్ణయించింది. గ్రామీణ పల్లెల ఆర్థిక స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే

మిగతా 2వ పేజిలో..

# ఒకే వేదికపై 191 మందికి ఉద్యోగ నియామక పత్రాలు

**మొదటిపేజీ తరువాయి..** ఇంత పెద్ద ఎత్తున నియామకాలు జరగడం ఒక సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని మంత్రి కొండా సురేఖ అభివర్ణించారు.

ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి మరియు ధర్మ పరిరక్షణకు దేవాలయాలే కేంద్ర బిందువులని పేర్కొన్నారు. భగవంతుని సేవలో తరించే భాగ్యం ఎంతో అదృష్టం ఉంటేనే దక్కుతుందని, అందుకే ఈ ఉద్యోగాలను కేవలం ఒక ఉపాధి వనరుగా కాకుండా ఆధ్యాత్మిక విలువలను కాపాడే గొప్ప బాధ్యతగా భావించాలని నూతన ఉద్యోగులకు సూచించారు. అర్చకుల ఆరాధన, వేదపండితుల మంత్రోచ్ఛారణలు, కళాకారుల వాయిద్యాలు, నిష్ఠతో కూడిన ప్రసాదాల తయారీ వంటి సేవలు సక్రమంగా సాగినప్పుడే ఆలయాల పవిత్రత, ఆధ్యాత్మిక శోభ ఇనుమడిస్తాయన్నారు. ఖాళీగా ఉన్న మతపరమైన పోస్టులను భర్తీ చేయడం ద్వారా ఆలయాల్లో నిత్య కైంకర్యాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత వైభవంగా, క్రమబద్ధంగా జరుగుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

దేవాలయాల సమగ్ర వికాసం కోసం ప్రభుత్వం మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకోబోతోందని మంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు. రాబోయే రోజుల్లో ఆయా ఆలయాల ప్రత్యేక రోజులలో ఆధ్యాత్మిక, ధార్మిక మరియు పురాణ ప్రవచనాలు నిర్వహించేలా త్వరలోనే ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. అంతేకాకుండా, గుడులలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగుల పనితీరును (పర్ఫార్మెన్స్) అంచనా వేసి, వారికి ప్రత్యేక అవార్డులను కూడా అందజేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇప్పటికే సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించామని, భవిష్యత్తులో రాబోయే గోదావరి, కృష్ణా నది పుష్కరాలను కూడా అదే స్థాయిలో నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మేడారం సమ్మక్క-సారక్క జాతర ప్రాంగణాన్ని ప్రభుత్వం అద్భుతంగా తీర్చిదిద్దిందని గుర్తుచేశారు.

ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై మంత్రి స్పందిస్తూ ఒక ముఖ్య ప్రకటన చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు తొలగి, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలంతా సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రముఖ దేవాలయాలలో అధికారికంగా 'వరుణయాగం' నిర్వహించనున్నట్లు మంత్రి కొండా సురేఖ ప్రకటించారు. ఈ చారిత్రాత్మక నియామకాల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ దేవాదాయ శాఖ ఉద్యోగులు మంత్రి సురేఖను గజమాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వైభవ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారితో పాటు పలువురు ఉన్నతాధికారులు, అర్చక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మీడియా అకాడమిలో డిజిటల్ ఆర్కైవ్స్

### మనసు ఫౌండేషన్ ప్రతినిధులతో చైర్మన్ చర్చలు

**హైదరాబాద్, :** తెలంగాణ మీడియా అకాడమీ చేపడుతున్న డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించి, ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడానికి శుక్రవారం మనసు ఫౌండేషన్ ప్రతినిధి బృందంతో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చర్చలు జరిపారు. తెలంగాణ మీడియా అకాడమీ పాత తెలుగు, ఆంగ్ల, ఉర్దూ వార్తాపత్రికలను డిజిటలైజ్ చేసి జర్నలిస్టులు, పరిశోధకులు, విద్యార్థులు, ఇతర ఆసక్తిగల వారికి లక్షలాది పేజీల సమాచారాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణకు సంబంధించిన
సుమారు 8 లక్షల పేజీలు డిజిటల్ ఆర్కైవ్‌లో నిక్షిప్తమై ఉన్నాయి. ఈ విలువైన సమాచారాన్ని పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ ఆర్కైవ్స్‌ను మరింత అభివృద్ధి చేయడం, సమాచార శోధనను సులభతరం చేయడం వంటి అంశాలపై మనసు ఫౌండేషన్ ప్రతినిధులతో విస్తృతంగా చర్చలు జరిగాయి. సమావేశంలో మనసు ఫౌండేషన్ చైర్మన్ రాయుడు, సభ్యులు చంద్రమౌళి, దాము బాలాజీ, వి. శేషతలపతి సాయి, ఎ.వి. రమణమూర్తి, జగన్ పాల్గొన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ తరఫున కార్యదర్శి ఎన్. వెంకటేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణచందర్ రావు, అకాడమీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సందర్భంగా మనసు ఫౌండేషన్ దాదాపు 28 లక్షల పేజీల చారిత్రక వార్తాపత్రికలు, పుస్తకాలు, గెజెట్లు, మ్యాగజైన్లు, ఇతర విలువైన పత్రాలను డిజిటలైజ్ చేసి భద్రపరిచిన విశిష్ట సేవలను తెలంగాణ మీడియా అకాడమీ అభినందించింది. భవిష్యత్ తరాలకు చారిత్రక సమాచారాన్ని అందుబాటులో ఉంచేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో డిజిటలైజేషన్ ప్రక్రియలో కాపీరైట్ నిబంధనలను పాటించడం, సంబంధిత అధికారుల అనుమతులు పొందడం, అరుదైన పుస్తకాలు, వార్తాపత్రికలు, గెజెట్లు, మోనోగ్రాఫ్‌లు, ఇతర చారిత్రక పత్రాలను డిజిటల్ రూపంలో భద్రపరచడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే డిజిటల్ ఆర్కైవ్స్‌ను మరింత విస్తరించే దిశగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, డిజిటలైజ్ చేసిన పత్రాలకు సమగ్ర ఇండెక్సింగ్, డాక్యుమెంటేషన్ నిర్వహించడం, ప్రత్యేక డిజిటల్ ఆర్కైవ్స్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేయడం, డేటా భద్రత కోసం ప్రత్యామ్నాయ కాపీలను భద్రపరచడం, జాతీయ స్థాయి సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఉత్తమ విధానాలను అనుసరించడం వంటి అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో నాగుళ్లపల్లి వెంకటేశ్వరరావు, అకాడమీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# భారత రైల్వే రంగంలో సరికొత్త విప్లవం

**మొదటిపేజీ తరువాయి..** దాదాపు 2,600 మంది ప్రయాణించే వీలుంది. ఈ మార్గంలో మొత్తం 12 స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది. ఈ రైలు పూర్తిగా పర్యావరణహితమైనది కావడం విశేషం. ఇందులో ఎలాంటి దహనచర్య జరగకపోవడం వల్ల హానికారక పొగ గానీ, కర్బన ఉద్గారాలు గానీ వెలువడవు. కేవలం నీటి ఆవిరి, వేడి మాత్రమే ఉప ఉత్పత్తులుగా బయటకు వస్తాయి. శబ్ద కాలుష్యం కూడా చాలా తక్కువగా ఉంటుంది. భద్రత పరంగా కూడా ఇందులో అత్యుత్తమ ప్రమాణాలు పాటించారు. హైడ్రోజన్ లీకేజీలు, వేడి, మంటలను క్షణాల్లో గుర్తించే బహుళ అంచెల నిఘా వ్యవస్థను ఇందులో ఏర్పాటు చేశారు. ఏదైనా ప్రమాదాన్ని గుర్తిస్తే స్వయంచాలకంగా హైడ్రోజన్ సరఫరాను నిలిపివేసే ఆటోమేటిక్ షటాఫ్ వ్యవస్థ ఉంది. నిరంతర వెంటిలేషన్ సదుపాయం వల్ల ఒకవేళ గ్యాస్ లీకైనా అది వెంటనే గాల్లో కలిసిపోతుంది. లోకో పైలట్ క్యాబిన్‌ను కూడా అత్యాధునికంగా డిజైన్ చేసి, రైలు స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక స్క్రీన్‌ను అమర్చారు. ప్రపంచవ్యాప్తంగా జర్మనీ (తొలి ప్యాసింజర్ హైడ్రోజన్ రైలు ప్రవేశపెట్టిన దేశం), అమెరికా, చైనా, జపాన్ వంటి దేశాలు ఈ సాంకేతికతపై పనిచేస్తుండగా, భారత్ సైతం ఈ క్లీన్ ఎనర్జీ లీగ్‌లోకి చేరడం దేశ రైల్వే రంగానికి గర్వకారణంగా నిలిచింది.

# ధరణి అక్రమాలపై 'సిట్'

**మొదటిపేజీ తరువాయి..** దిశగా క్యాబినెట్ మరో చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ఇందుకోసం 'తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018' లోని సెక్షన్ 70(3)ను సవరించేందుకు ఆమోదం తెలిపింది. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయాలనే నిబంధన ఉండేది. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం ఆలస్యమై, స్థానిక పాలన కుంటుపడేది. ఈ ఇబ్బందులను శాశ్వతంగా తొలగిస్తూ, ఇకపై పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా ఆయా గ్రామ పంచాయతీల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది.

# ఆంధ్రప్రదేశ్‌లో 12 కొవిడ్ కేసులు నమోదు

మొదటిపేజీ తరువాయి.. మరియు కాకినాడ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కేసులు బయటపడ్డాయి. ఈ ఏడాది రాష్ట్రంలో తొలి కొవిడ్ కేసు జూన్ 26న కడప జిల్లాలో నమోదు కాగా, మిగిలిన 11 కేసులు జులై 1 నుంచి 16 మధ్య కాలంలో వెలుగులోకి వచ్చాయి. బాధితుల్లో ఇద్దరు అంతకుముందే కొవిడ్ సోకిన వ్యక్తులతో సన్నిహితంగా మెలిగినట్లు అధికారులు గుర్తించారు.

ఈ 12 మంది బాధితులలో నలుగురు మృతి చెందినట్లు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ అధికారిక ప్రకటనలో తెలిపారు. మరణించిన వారిలో కడప జిల్లాకు చెందిన ముగ్గురు, కాకినాడ జిల్లాకు చెందిన ఒకరు ఉన్నారు. అయితే, వీరంతా కొవిడ్ వల్ల మాత్రమే కాకుండా, అంతకుముందే తీవ్రమైన రక్తపోటు (బీపీ), మధుమేహం (షుగర్), కిడ్నీ సంబంధిత సమస్యలు మరియు ఇతర దీర్ఘకాలిక అనారోగ్య వ్యాధులతో బాధపడుతున్నారని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో జూన్ 26 నుంచి జులై 15 వరకు మొత్తం 67 మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించగా 11 మందికి పాజిటివ్‌గా తేలింది. కాకినాడ జిల్లాకు చెందిన మరో బాధితుడికి తమిళనాడులోని వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చేసిన పరీక్షల్లో వైరస్ ఉన్నట్లు తేలింది.

వైరస్ తీవ్రతను, దాని కొత్త వేరియంట్ల జన్యు స్వరూపాన్ని అంచనా వేసేందుకు వీలుగా 5 కొవిడ్ నమూనాలను జులై 9న పుణెలోని జాతీయ వైరాలజీ సంస్థకు (చీ×ం) జన్యుక్రమ విశ్లేషణ (జీనోమ్ సీక్వెన్సింగ్) కొరకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం నమోదైన కేసుల్లో ముగ్గురు బాధితులు కోలుకుని ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి కాగా, మరో ముగ్గురు హోమ్ ఐసోలేషన్‌లో (స్వీయ గృహ నిర్బంధం) చికిత్స పొందుతున్నారు. మిగిలిన ఇద్దరు ఆసుపత్రుల్లో చేరి చికిత్స తీసుకుంటున్నారు. కేసులు నమోదైన నేపథ్యంలో ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, అయితే తగిన ముందు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. రాష్ట్రంలోని వైద్యులు, ఆసుపత్రి సిబ్బందిని ఇప్పటికే అప్రమత్తం చేసినట్లు వీర పాండియన్ పేర్కొన్నారు.

మరోవైపు దేశవ్యాప్తంగా కూడా కొవిడ్ కేసులు స్వల్పంగా నమోదవుతున్నాయి. జులై 1 నుంచి దేశవ్యాప్తంగా మొత్తం 339 కొవిడ్ కేసులు రికార్డయ్యాయి. ఇందులో అత్యధికంగా కేరళ రాష్ట్రంలో 115 కేసులు నమోదు కాగా, కర్ణాటకలో 64, మహారాష్ట్రలో 43, తమిళనాడులో 39, అండమాన్ మరియు ఢిల్లీలలో చెరో 18, రాజస్థాన్‌లో 12 కేసులు వెలుగుచూశాయి. మిగిలిన కేసులు ఇతర రాష్ట్రాల్లో నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.

# ప్రయాణికుల్లో వర్గ విభజన సరికాదు

**మొదటిపేజీ తరువాయి..** ప్రయాణికులను ఆ విధంగా పిలవడం రాజ్యాంగం కల్పించిన సమానత్వ స్ఫూర్తికి పూర్తి విరుద్ధమని, ఇది గత చరిత్రలోని వివక్షాపూరిత వర్గ విభజనలను గుర్తు చేస్తోందని ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించింది. ఒక రైలు ప్రమాద బాధితురాలికి రూ. 8 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించిన సందర్భంగా కోర్టు ఈ సంచలన వ్యాఖ్యలు చేసింది. ప్రమాద సమయంలో అనుకోకుండా టికెట్ పోయినంత మాత్రాన బాధితులకు పరిహారాన్ని నిరాకరించడానికి వీల్లేదని న్యాయస్థానం తేల్చి చెప్పింది. టికెట్ పోయిన సందర్భాల్లో బాధిత కుటుంబాలు ఇచ్చే అఫిడవిట్‌ను ప్రామాణికంగా తీసుకోవాలని స్పష్టం చేసింది. సదరు ప్రయాణికుడికి అసలు టికెట్టే లేదని నిరూపించాల్సిన బాధ్యత పూర్తిగా రైల్వే శాఖపైనే ఉంటుందని కోర్టు పేర్కొంది. రైల్వే ప్రమాద పరిహార చట్టాలను సాంకేతిక కారణాల వంకతో కాకుండా, మానవతా దృక్పథంతో మరియు ఉదారంగా అమలు చేయాలని హితవు పలికింది.

రైల్వే భద్రతపై కూడా సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. భద్రతా నిబంధనలు కాగితాల మీద చాలా బాగుంటున్నాయని, కానీ క్షేత్రస్థాయిలో వాటి అమలు లోపిస్తోందని ధర్మాసనం తప్పుబట్టింది. రైల్వే శాఖలో సుదీర్ఘకాలంగా ఉన్న ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని, దీనివల్ల దేశంలోని యువతకు ఉపాధి లభించడమే కాకుండా, రైల్వే భద్రత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని కోర్టు సూచించింది. ఇదే సమయంలో ప్రయాణికులకు కూడా న్యాయస్థానం కీలక సూచనలు చేసింది. కేవలం రైల్వే శాఖే కాకుండా ప్రయాణికులు కూడా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, ప్రాణాలకు తెగించి ఫుట్‌బోర్డ్ (రైలు గుమ్మం) ప్రయాణాలు చేయవద్దని ధర్మాసనం హెచ్చరించింది.

## నీటి సంపులో దూకి తల్లీ బిడ్డల ఆత్మహత్య

**నాగర్‌కర్నూల్** నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వెల్దండ మండలం పోతేపల్లిలో ఈ ఘటన జరిగింది. ఎనుముల శిరీష (23) తమ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో కుమార్తె మానశ్రీ (3), కుమారుడు వర్షిత్ (4 నెలలు)ను పడేసి.. ఆపై తానూ అందులోకి దూకేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలతో కలిసి శిరీష బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది.

## బుల్లెట్ రైలు ప్రాజెక్టు ఆలస్యంపై జపాన్ మాజీమంత్రి వ్యాఖ్యలు

### అందులో ఎంతమాత్రం నిజం లేదన్న విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ, :** ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టులో జాప్యంపై జపాన్ మాజీ మంత్రి హిడెకీ మకిహారా తాజాగా చేసిన ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. ఆ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగత అభిప్రాయమని భారత విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఆ కామెంట్స్ వాస్తవాలను ప్రతిబింబించట్లేదని అన్నారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టు విషయంలో ఇరు దేశాల మధ్య చర్చలు సానుకూలంగా సాగుతున్నాయని అన్నారు. నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయని చెప్పారు. వచ్చే ఏడాది ఈ ప్రాజెక్టులో తొలి దశ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఇక 2030 కల్లా జపాన్‌కు చెందిన ఈ10 సిరీస్ బు÷-లలెట్ రైళ్లు సరఫరా అవుతాయని ప్రభుత్వ వర్గాలు గతంలో పేర్కొన్నాయి.

షిన్‌కాన్సెన్ సాంకేతికతతో ప్లాన్ చేసిన ఈ రైలు ప్రాజెక్టు ముందు అనుకున్న దానికంటే భిన్నంగా ఉందని జపాన్‌కు చెందిన ఒక ఇంజినీర్ ఇటీవల స్థానిక పత్రికలో ఒక వ్యాసం రాశారు. దీనిపై జపాన్ మాజీ మంత్రి హిడెకీ స్పందిస్తూ ఓ భారతీయ మంత్రి, అధికారులు గతంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని అన్నారు. స్వీయ ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సిగ్నలింగ్ వ్యవస్థ జపాన్‌కు దక్కలేదని అన్నారు.

## కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఫిల్మ్ ఫెడరేషన్ షాక్

### వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని షోకాజ్ నోటీసులు

**హైదరాబాద్, జులై17:** కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు ఫిల్మ్ ఫెడరేషన్ షాక్ ఇచ్చింది. ఫిల్మ్ ఫెడరేషన్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ అతడికి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జులై 12న జానీ మాస్టర్ చేసిన వ్యాఖ్యలను ఫిల్మ్ ఫెడరేషన్ సీరియస్‌గా తీసుకుంది. జులై 14న విచారణకు హాజరు కావాలంటూ అతడికి సూచించింది. దీనిపై జానీ మాస్టర్ నుంచి స్పందన లేదు. దీంతో ఫిలిం ఫెడరేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వారం రోజుల్లో లిఖిత పూర్వక వివరణ ఇవ్వాలని జానీ మాస్టర్‌ను ఆదేశించింది. బహిరంగ క్షమాపణలు చెప్పకుంటే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించింది. అలాగే డ్యాన్సర్ల అసోసియేషన్ తీరుపై ఫిల్మ్ ఫెడరేషన్ మండిపడింది. డ్యాన్సర్ల అసోసియేషన్ అధ్యక్షురాలు సుమలత తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. జనరల్ బాడీ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని ఆమెకు స్పష్టం చేసింది. డ్యాన్సర్ల ఉపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది. అయితే వివరణ ఇచ్చే వరకు డాన్సర్ అసోషియేషన్‌తోపాటు జానీ మాస్టర్‌కు సహకరించకూడదంటూ అనుబంధ సంఘాలకు ఫిలిం ఫెడరేషన్ ఆదేశాలు జారీ చేసింది.

## కోవిడ్ వ్యాప్తిపై నిరంతన పర్యవేక్షణ

### ఆందోళన చెందాల్సిన పనిలేదన్న మంత్రి సత్యకుమార్

**విజయవాడ,జూలై17** కొవిడ్‌పై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. కేసుల పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్టీఆర్ జిల్లా రాయనపాడులో మీడియాతో ఆయన మాట్లాడారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ కొవిడ్ కేసులు వస్తున్నాయన్నారు. కేరళలో 115, కర్ణాటకలో 64, తమిళనాడులో 39 కేసులు బయటపడ్డాయని.. రాష్ట్రంలో 13 మాత్రమే నమోదయ్యాయని తెలిపారు.

# విద్యార్థుల యూడైస్ నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి

- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.**






ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి గురువారం రాత్రి హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయం నుంచి విద్య, వ్యవసాయ, వైద్యారోగ్య తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల యూడైస్ నమోదు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. కేంద్రీకృత ఆహారశాల ఏర్పాటు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. యూనిఫాంల ను త్వరితగతిన సిద్ధం చేసి విద్యార్థులకు అందించాలని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు.జిల్లాల వారిగా వర్షపాతం,పంటల సాగు, ఎరువులు, విత్తనాల లభ్యతను సమీక్షించారు. అన్ని జిల్లాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు,ఎరువులు అందించాలని వివరించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. పంట మార్పిడి విధానాలు,ఆయిల్ పామ్, కూరగాయల పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని అన్నారు. ప్రాజెక్టుల్లో నీటి మట్టం వివరాలు సమీక్షించారు. కాలానుగుణ వ్యాధులు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మెరుగైన పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో అవసరమైన వైద్యసేవలు అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో అదనపు కలెక్టర్ నగేష్ రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, డీఈవో రాజు ,డిపివో యాదయ్య, సిపిఓ, సురేష్, హార్టికల్చర్ అధికారి ప్రతాప్ సింగ్ , గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం,డిఎం సివిల్ సప్లై నిత్యానంద, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్ అమలుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలి

- **మెదక్ పట్టణ బిఆర్ఎస్ కన్వీనర్ 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు.**




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)

మెదక్ పట్టణ అభివృద్ధికి అత్యంత కీలకమైన నూతన మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేయాలని మెదక్ పట్టణ టీఆర్ఎస్ కన్వీనర్, 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు దాదాపు 40 సంవత్సరాల క్రితం రూపొందించిన పాత మాస్టర్ ప్లాన్‌ల స్థానంలో నూతన మాస్టర్ ప్లాన్‌లు రూపొందించే ప్రక్రియలో భాగంగా, గత పాలకవర్గం మెదక్ పట్టణానికి సంబంధించిన సమగ్ర సర్వేలను పూర్తి చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందన్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా, నూతన మాస్టర్ ప్లాన్ అమలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల మెదక్ పట్టణ అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ లేకపోవడంతో కొత్త భవనాలకు నిర్మాణ అనుమతులు జారీ కావడం లేదని, దీంతో ప్రజలు అక్రమ నిర్మాణాల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు.ఫలితంగా మున్సిపాలిటీకి రావాల్సిన నిర్మాణ అనుమతి ఫీజులు, ఆస్తి పన్నులు వంటి ఆదాయం కోల్పోయి ఆర్థికంగా నష్టపోతోందని పేర్కొన్నారు. ఇప్పటికే మాస్టర్ ప్లాన్ పరిధిలో నిర్మించిన భవనాలకు బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (బి ఆర్ ఎస్) ద్వారా పూర్తి స్థాయి అనుమతులు కల్పించాలని, అలాగే మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌ను వెంటనే ఆమోదించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసి మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌కు త్వరితగతిన ఆమోదం వచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.మెదక్ పట్టణ భవిష్యత్ అభివృద్ధి దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఎన్ లీనో ప్రభావం వల్ల నీటి కొరతా ఏర్పడే అవకాశం ఉంది

- **జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్.**




ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)

ఎన్ లినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరికి ప్రత్యామ్నాయ, తక్కువ నీటి వినియోగ పంటల సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో ఎన్ లినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలన్న అంశంపై వ్యవసాయ, ఉద్యాన వన శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు సాంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా, సాగులో వైవిధ్యాన్ని పాటించి, తక్కువ నీటి వినియోగంతో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగుచేయాలని ఆమె సూచించారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు వీలుగా మిల్లెట్స్, కూరగాయలు, పప్పు దినుసులు, పామాయిల్ సాగుపై రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల కంటే ఆరుతడి పంటలు, తక్కువ రోజుల్లో చేతికి వచ్చే రకాలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పర్యటించి, ప్రస్తుత పరిస్థితులకు అనుకూలమైన పంటల వివరాలను రైతులకు వివరించాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేందుకు బిందు, తుంపర్ల సేద్యం వంటి ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ తగిన సలహాలు,సూచనలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. బోరు బావుల ద్వారా పంట సాగు చేస్తున్న రైతులు వరి సాగు చేయొద్దని, రానున్న రోజుల్లో భూ గర్భ జలాలు తగ్గిపోయి నీటి కొరత ఏర్పడుతుందని తద్వారా పంట నష్టం వస్తుందని సూచించారు.కూరగాయలు సాగుకు ప్రభుత్వం ఎకరాకు 9,600 రూపాయలు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. సాగు చేయాల్సిన పంటలపై జిల్లా కంటింజెంట్ (జిల్లా అత్యవసర ప్రణాళిక) ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, ఇంచార్జ్ జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఉద్యాన అధికారి ప్రతాప్ సింగ్ అన్ని మండలాల ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

# చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17(జన సంఘర్షణ)



ద్విచక్ర వాహనని టిప్పర్ డికొట్టడంతో చికిత్స పొందుతు వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొత్తపల్లిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పాపన్నపేట పోలీసులు, కుటింబీకుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తపల్లి గ్రామనికి చెందిన బ్యాగరి దుర్గయ్య(75)వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగితున్నాడు. గత మంగళవారం ఎల్లపూర్ లో పని ఉందని ద్విచక్రవాహనం మొపేడ్‌పై న్యాత వెంకటేశం ను తీసుకొని వెళ్లి ఎల్లపూర్ లో పని ముగించుకొని తిరిగి స్వగ్రమైన కొత్తపల్లి వస్తున్న క్రమంలో శానాయిపల్లి గ్రామ శివారులో వెనకనుండి అతివేగంగా వచ్చిన టిప్పర్ టిఎస్ 08యు జె 9679గల టిప్పర్ లారీ డి కొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలు కావడంతో ఈవిషయం గమనించిన స్థానికులు వెంటనే 108వాహనం, పోలీసులకు సమాచారం అందివ్వడంతో 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా మృతుడు దుర్గయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా గత రెండు రోజులుగా చికిత్స పొందుతు గురువారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కాగా మృతుడి భార్య లక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## కిరణ్ సాగర్ కుమార్తె కాలు విరగడంతో మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17(జన సంఘర్షణ)



బిఆర్ఎస్ కార్యకర్త కిరణ్ సాగర్ వారి కుమార్తె కాలు ఫ్రాక్చర్ కావడంతో విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ బాదే చంద్రం, కౌన్సిలర్ మరదల రమేష్, హస్మొద్దీన్, ఉమామహేశ్వర్, శ్రీకాంత్ సాగర్, బబ్లు, మధుకర్ కిరణ్ సాగర్, వంశీ సాగర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేత

- **కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా నిజాంపేట మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ సమీర్ చెరువులో పడి మృతి చెందారు. ఇట్టి సమాచారాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్‌కి తెలియజేయగా వారి ఊరికి చేరుకొని కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజు, ఉప అధ్యక్షుడు రాములు, మాజీ సర్పంచ్ లక్ష్మణ్, మాజీ కోఆప్షన్ మెంబర్ గౌస్, భాస్కర్, అశోక్, బాబు, నర్సింలు, రాజు, జెట్ చెరువు తండా సర్పంచ్ బాబు, బాలకృష్ణ, సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ రైల్వే ప్రస్థానం

- **తొలి ప్రయాణపు ఆనందం.**
- **పెండింగ్‌లో ఉన్న ఆకాంక్షలు!**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధిజూలై 17(జన సంఘర్షణ)




మెదక్ జిల్లా కేంద్రానికి రైలు సౌకర్యం అందుబాటులోకి రావడం స్థానికులకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. తాజాగా మెదక్‌కు చెందిన సాయిచరణ్ రెడ్డి తొలిసారిగా రైలులో ప్రయాణించి,తన మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. అయితే,ఈ ప్రయాణ ఆనందంతో పాటు, మెదక్ రైల్వే స్టేషన్ సర్వీసుల విస్తరణపై స్థానికంగా గళం పెరుగుతోంది. కొత్త అనుభవం శుక్రవారం ఉదయం 5 గంటలకు మెదక్ ప్రాంతం నుండి తన ప్రయాణాన్ని ప్రారంభించిన సాయిచరణ్ రెడ్డి,బొల్లారం స్టేషన్‌లో దిగి కొంపల్లిలో తన పనులు ముగించుకున్నారు. తిరిగి ఆల్వాల్ స్టేషన్ మీదుగా మెదక్ చేరుకున్నారు.తొలి రైలు ప్రయాణం నాకు ఎంతో మధురమైన అనుభూతిని ఇచ్చింది.దశాబ్దాల కల సాకారమైనా,ప్రయాణ సౌకర్యాల పరంగా ఇంకా ఎన్నో మెరుగుదలలు అవసరం, అని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**అందని ఫలాలు. ఎదురుచూస్తున్న మెదక్:**

మెదక్ రైల్వే స్టేషన్ ప్రారంభమై మూడేళ్లు కావస్తున్నా, ప్రయాణికులకు ఆశించిన స్థాయిలో సదుపాయాలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం స్టేషన్ నుండి పరిమిత సంఖ్యలో మాత్రమే రైళ్లు నడుస్తుండటంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం,సాయంత్రం వేళల్లో మాత్రమే రెండు రైళ్లు నడుస్తుండటంతో, నిజామాబాద్ వంటి ముఖ్య ప్రాంతాలకు వెళ్లడం కూడా సామాన్యులకు కష్టతరంగా మారుతోంది.ప్రజా ప్రతినిధుల చొరవపై ఆశలు:మెదక్ నియోజకవర్గ ప్రజలు మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావుపై భారీ ఆశలు పెట్టుకున్నారు. రైల్వే ప్రాజెక్టుల పూర్తికి మరిన్ని రైళ్లను మంజూరు చేయించేందుకు ఎంపీ ప్రత్యేక చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రజల ప్రధాన డిమాండ్లు:**

రైళ్ల పెంపు: ప్రస్తుతమున్న రెండు రైళ్లకు అదనంగా మరిన్ని రైళ్లను మంజూరు చేసి,మెదక్ స్టేషన్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలి.నిజామాబాద్ అనుసంధానం:మెదక్ నుండి నిజామాబాద్ వైపు కొత్త రైలు సర్వీసులను పొడిగించడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలి. సమయపాలన: ప్రయాణికుల రాకపోకలకు అనుగుణంగా టైమ్ టేబుల్‌ను క్రమబద్ధీకరించాలి. మెదక్ రైల్వే స్టేషన్ కేవలం నామమాత్రంగా మిగిలిపోకుండా,నిత్యం ప్రయాణికులతో కళకళలాడాలంటే కేంద్ర ప్రభుత్వం స్థానిక ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది. రైల్వే అభివృద్ధి చెందితేనే మెదక్ ప్రాంతం ఆర్థికంగా,పారిశ్రామికంగా మరింత వృద్ధి చెందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు చేగుంటకు మంత్రి వివేక్ రాక

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)



IMMEDIATE /CONFIDENTI

OFFICE OF THE HON'BLE MINISTER FOR
LABOUR, EMPLOYMENT, TRAINING, FACTORIES AND MINES & GEOLOGY

T.P. No. 15/2025 Date: 17 Jul 2026

WIRELESS MESSAGE

| From | To |
|---|---|
| Sri. A.V Ramana Rao, Private Secretary to Hon'ble Minister For Labour, Employment Training, Factories, and Mines & Geology, Govt. of Telangana, Hyderabad. | 1. The Collector & District Magistrate, Hyderabad, Medak, Siddipet, Mancherial Districts. The Commissioner / Superintendent of Police, Hyderabad, Medak, Siddipet, Mancherial, Ramagundam Peddapalli District, |

Repeat To: ALL THE MINISTERs / MPs / MLCs & MLAs OF DISTRICTS.

Inform To: The district level Officers for Labour, Employment, Training, & Factories, and Mines & Geology.

Following is the tour programme of Sri. Dr. G. Vivek Venkataswamy, Hon'ble Minister for Labour, Employment Training, Factories, and Mines & Geology, Govt. of Telangana.

| Time | Departure / Arrival | Location | Mode of Transport |
|---|---|---|---|
| 18 Jul 2026: | | | |
| 07:45 AM | Departure | From Banjara hills Hyderabad to Chegunta, Dubbaka Constituency, Medak Dist. | By Road |
| 09:15 AM | Arrival | At Chegunta, Dubbaka Constituency, Medak Dist. | By Road |
| 09:30 AM to 10:15 AM | - | Distribution of School Kits to ZPHS School Students at Chegunta. | - |
| [illegible] | Departure | From Chegunta to Jakkapur, Siddipet Dist. | By Road |

మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో శనివారం ఉదయం 9 గంటల 15 నిమిషాలకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే రైతులకు ఎల్ నినో పై అవగాహన కార్యక్రమానికి, చేగుంట జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు స్కూల్ కిట్టు అందించే కార్యక్రమానికి గౌరవ తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు, కార్మిక, ఉపాధి, గనుల, పారిశ్రామిక, భూగర్భ వనరుల శాఖ మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి రానున్నారని అధికారులు సమన్వయంతో మంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో ఆదేశించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శనివారం
18 జులై 2026

# కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను ఆకస్మికంగా సందర్శించిన డి.ఎం.హెచ్.ఓ.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా వెల్దుర్తి లోని కస్తూర్బా గాంధీ బాలికలవిద్యాలయం ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.గణేశ్వర్ఆకస్మికంగా సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వర్షాకాలంలో ఆడపిల్లలు ఆరోగ్యంగా వుండాలని, వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని,ఈ సీజన్ లో ముఖ్యంగా జలుబు,జ్వరం, దగ్గు,ఫ్లూ,న్యుమోనియా, మలేరియా, డెంగ్యూ, వైరల్ జ్వరాలు, వాంతులు విరేచనాలు మొదలైన వ్యాధులు వచ్చే అవకాశం వుందని, కాబట్టి కలుషిత ఆహారం, నీరు తాగవద్దని,వేడి వేడి ఆహారాన్ని తినాలని, శుభ్రమైన మంచి నీటినే తాగాలని,ఆహార పదార్థాలపై మూతలు తప్పక పెట్టాలని, ఈగలు, దోమలు లేకుండా చూడాలని, పరిసరాల పరిశుభ్రత,వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమని, చేతుల పరిశుభ్రత తప్పక పాటించాలని, జలుబు, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రానికి వెళ్ళి పరీక్షలు చేయించుకొని చికిత్స తీసుకోవాలని,తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు మోచేతిని అడ్డం పెట్టుకోవాలని,14 - 15 సంవత్సరాల మధ్య వున్న అమ్మాయిలు హెచ్.పి.వి. వ్యాక్సిన్ తప్పక తీసుకోవాలని జిల్లాలో ఇప్పటివరకు 70 శాతం హెచ్.పి.వి. ఇమ్యునైజేషన్ పూర్తిచేశామని,మిగిలిన వారికి కూడా టీచర్లు, తలితండ్రుల భాగస్వామ్యంతో పూర్తి చేస్తామని, దీనివల్ల భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్, ఇతర క్యాన్సర్ ఇన్ఫెక్షన్లు రాకుండా ముందస్తుగానే నివారించవచ్చని,మొన్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నాడు అల్బెండజోల్ టాబ్లెట్ వేసుకోని వారు 20 వ తేది నాడు నిర్వహించే మాపప్ కార్యక్రమం రోజున తప్పక తీసుకోవాలని, చదువు కుంటున్న పిల్లలు చదువులు పూర్తి అయ్యేంతవరకు,తమ కాళ్ల మీద సొంతంగా నిలబడే వరకు కనీసం 21 సంవత్సరాల వయసు దాటిన తర్వాతే పెళ్లి గురించి ఆలోచించాలని, మానసికంగా,శారీరకంగా పూర్తిగా ఎదగని యుక్త వయసులో తొందరపడి పెళ్లి చేసుకోవడం వల్ల శారీరక , మానసిక సమస్యలు చాలా వస్తాయని, రక్తహీనతతో బాధపడుతారని, అలాంటి చిన్న వయసులో గర్భం ధరించడం వల్ల గర్భస్రావాలు జరుగుతాయని, పుట్టబోయే శిశువు కూడా సరైన బరువు లేక అనారోగ్యంతో పుడుతారని,కావున పెళ్లి విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకొని శారీరక



మానసిక సమస్యలు కొని తెచ్చుకోవద్దని తెలిపారు. హాస్టల్ రూంలను, వంటలు చేసే సామాగ్రిని, కిచెన్ ను, తాగునీటిని,వాష్ రూంలను,నీరు బయటికిపోయే నాళాలను , పాఠశాల ఆవరణను పరిశీలించి పరిశుభ్రత, ఫుడ్ పాయిజనింగ్ కాకుండా,దోమలు పుట్టకుండా కుట్టకుండా, వ్యాధులురాకుండా తీసుకోవలసినజాగ్రత్తలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. గణేశ్వర్ హెడ్ మాస్టర్ , పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు తెలియజేశారు.

# రైతుల సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ..

- **తహసీల్దార్‌కు వినతిపత్రం**
- **నిజాం సాగర్ నీటిని వెంటనే విడుదల చేయాలిలి బిజెపి బాన్సువాడ ఇంచార్జ్ ఎన్నారై కోనేటి శశాంక్ ఆధ్వర్యంలో.......**

కోటగిరి, జూలై 17 (జన సంఘర్షణ):
నిజామాబాద్ జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కోటగిరి మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ కోటగిరి మండల అధ్యక్షుడు ఏముల నవీన్ నాయకత్వంలో కార్యకర్తలు, రైతులు నినాదాలతో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తగినంత వర్షాలు లేక వేల ఎకరాల్లో వరి నాట్లు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు పనిచేయక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా సమస్యల కారణంగా సాగు పనులు మరింత దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వల నుంచి సాగునీటిని వెంటనే విడుదల చేయాలని, జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులతో





అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు తక్షణ కార్యాచరణ చేపట్టాలని కోరారు. రైతుల ఆందోళనలను ప్రభుత్వం గుర్తించి, సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి రైతులకు భరోసా కల్పించాలని బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో నియోజవర్గ సీనియర్ నాయకులు మార్కెల్లి ప్రకాష్ పటేల్, పైడిమల లక్ష్మీనారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, గూడూరి ప్రశాంత్ గౌడ్, పేరుక రామన్న, పుల్లల మోహన్ రావు, హౌగిరిరావు దేశాయ్,పార్వతి మురళి,సాయి కుమార్, గౌడ్,గుంజరిజగదీష్, శ్యామ్, వెంకటేష్, ఏముల గజేందర్, కుర్లెపు గంగాధర్, రేపల్లి సాయి ప్రసాద్,నడిపి రాజేష్, మామిడి శ్రీనివాస్, నరేష్,వడ్లశ్యామ్, నల్లోల సాయిలు, మహిళా మోర్చా జిల్లా నాయకురాలు కులకర్ణి శ్యామల , తిరుమలాపూర్ విజయ్, రాజు పటేల్, మక్కయ్య, నాగనాథ్ పటేల్, పుప్పాల రవి, మేకల గంగాధర్, జగదీష్, సుంకుని సాయిలు, వినోద్ కుమార్, సాయికుమార్, రమేష్, ఎర్రోళ్ల గంగాధర్, మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొనడం జరిగింది.

# సబ్ రిజిస్టర్ కార్యాలయానికి 20 గుంటల స్థలానికి కేటాయించిన మున్సిపల్ చైర్మన్ గజవాడ

- **లావణ్య నాగరాజు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 17 (జన సంఘర్షణ)





మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఎన్నో సంవత్సరాల నుండి సబ్ రిజిస్టర్ ఆఫీస్ స్వంత భవనం లేక కిరాయి భవనం లో నడుపుచున్నారు. కావున ఇట్టి ఆఫీస్ కు స్వంత భవనం కట్టుకోవడానికి, తహసీల్దార్ ఆఫీస్ ఎదురుగా, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు సహకారంతో తహసీల్దార్ రజని కుమారి, మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు కలిసి శుక్రవారం 20గుంటల స్థలాన్ని కేటాయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్టర్, కాన్సిలర్స్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కోడిచర్లలో పోతంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

పోతంగల్, /జూలై 17/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని కోడిచర్ల గ్రామంలో గ్రామీణ ప్రజల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో పోతంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డా. కె.వి. రెడ్డి మెమోరియల్ కంటి ఆసుపత్రి, లయన్స్ జనరల్ హాస్పిటల్ వైద్యులు, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కోటగిరి పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన పెద్దలు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోతంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పున్నే అర్జున్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలను ముందుగానే గుర్తించి ఉచిత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని గ్రామాల్లో ఇలాంటి ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కోడిచర్ల గ్రామ సర్పంచ్ మొండే కవిత ఈర్వంత్ శిబిరాన్ని ప్రారంభించి, పోతంగల్ ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రజలకు అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు గంధపు దత్తు, ప్రధాన కార్యదర్శి వడ్ల సురేష్, కార్యదర్శి బ్యాగారి విజయ్, సహాయ కార్యదర్శి ఎర్రోళ్ల యాదవరావు, కోశాధికారి సర్గు లక్ష్మణ్, గౌరవ సలహాదారులు నూతపల్లి గణేష్, కనకమెడల శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ పాకల గజేందర్, కార్యవర్గ సభ్యులు మొండే భీమ్రావు, కాంబ్లె రాజేష్, ముత్యాల శ్రీకాంత్, షేక్ అజారుద్దీన్, మేత్రి శీను తదితరులు పాల్గొన్నారు.

# నామకరణ మహోత్సవానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కన్నాపురం కృష్ణ గౌడ్బిపద్మ దంపతుల మనుమడు 21వ రోజు నామకరణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, చిన్నారిని ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బాదే చంద్రం,మున్సిపాలిటీ మాజీ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్,మున్సిపల్ 10వ వార్డు కౌన్సిలర్ రమేష్,బీఆర్ఎస్ నాయకులు ఉమామహేశ్వర్, అస్నొద్దీన్,మార్కు రాజు,వంశీ, మధుకర్,శ్రీకాంత్ సాగర్, శ్రీకాంత్, శ్రీను నాయక్ తదితరులు పాల్గొని చిన్నారికి ఆశీర్వాదాలు అందించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బీఆర్ఎస్ కార్యకర్త కుమార్తె వివాహానికి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి ఆర్థిక సహాయం అందజేత

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)



రామాయంపేట మండలంలోని ఝాన్సీ లింగాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త తుడుం. శ్రీనివాస్ కుమార్తె వివాహానికి బీఆర్ఎస్ జిల్లా నాయకులు కంఠారెడ్డి. తిరుపతి రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. రైతుబంధు మండల మాజీ అధ్యక్షులు బానప్ప గారి నర్సారెడ్డి ద్వారా ఈ సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని కంఠారెడ్డి తిరుపతి రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బండమీది బాబు, మదూరు స్వామి, సాల్మన్, మదూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డు లబ్ధిదరులందరూ జూలై 31, 2026 లోపు ఈ-కేవైసీ పూర్తి చేయాలని

- **జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)



పౌర సరఫరాల కమిషనర్ (సి సి ఎస్) ఆదేశాల మేరకు జిల్లాలోని అర్హులైన రేషన్ కార్డుదారులందరూ ఈ-కేవైసీ (ఈ కేవైసీ)ను ఈ నెలాఖరు (జూలై 31)లోగా తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని భారత ప్రభుత్వానికి (జి ఓ ఎల్) ఈ-కేవైసీ వివరాలను నవీకరించాల్సి ఉన్నందున జిల్లాలో ఈ ప్రక్రియను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని రేషన్ షాప్ డీలర్లు తమ పరిధిలోని లబ్ధిదారులతో పాటు పోర్టబిలిటీ ద్వారా రేషన్ పొందుతున్న లబ్ధిదారుల ఈ-కేవైసీని కూడా తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు.మెదక్ జిల్లాలో అన్ని రేషన్ షాప్ డీలర్లు ప్రతిరోజూ నిరంతరాయంగా రేషన్ దుకాణాలను తెరిచి ఉంచి,అర్హులైన లబ్ధిదారులందరికీ,అలాగే పోర్టబిలిటీ ద్వారా రేషన్ పొందుతున్న లబ్ధిదారులకు కూడా ఈ-కేవైసీ నిర్వహించి, జూలై 31వ తేదీలోగా 100 శాతం ఈ-కేవైసీ పూర్తి చేయాలని ఆయన సూచించారు. త్వరలో కమిషనర్ జిల్లాల వారీగా ఈ-కేవైసీ పురోగతిని సమీక్షించనున్నందున, అర్హులైన రేషన్ కార్డుదారులు తమ సమీప రేషన్ దుకాణాన్ని సందర్శించి జూలై 31వ తేదీలోగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు.

# రాములు కుటుంబానికి పద్మశాలి సంఘం ఆర్థిక సహాయం అందజేత

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాపన్నపేటకు చెందిన మరెల్లి రాములు అంత్యక్రియల నిమిత్తం నిరుపేద కుటుంబానికి తమవంతు సహాయంగా మానవత దృక్పధంతో పాపన్నపేట చేనేత సంఘం అధ్యక్షులు కొడుపాక విట్టల్, ఉపాధ్యక్షుడు పల్లె సంగమేశ్వర్,ప్రధాన కార్యదర్శి కొడుపాక వెంకటేశం చేనేత సంఘం డైరెక్టర్లు తరపున రూ.3000/- పాపన్నపేట పద్మశాలి కులదైవం తరుపున తూర్పు నాగేశ్వర్,కొడుపాక శివశంకర్ కులస్థుల తరుపున రూ.2000 /- లు మొత్తం రూ.5000/- రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈకార్యక్రమంలో పాపన్నపేట మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు వళ్ళందేశి శ్రీనివాస్,పడిగే కిష్టయ్య,తూర్పు రాములు, తూర్పురాము తదితరులు పాల్గొన్నారు.

## పక్కగా భూముల రీసర్వే

◆ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)




పక్కగా భూముల రీసర్వే చేయాలని జిల్లా అదనపుకలెక్టర్ నగేష్ అధికారులనుఆదేశించారు. శుక్రవారంరోజున అల్లదుర్గం మండలకేంద్రములోని నిర్వహించిన భూముల రీసర్వే గ్రామ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. భూ సమస్యలు తలెత్తకుండా ,ప్రతి రైతుకు భూహక్కులు కల్పించేలా భూమి రీ సర్వే చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. రైతులకు భూ వివాదాలు లేకుండా చేసిప్రతి భూ కమతానికి భూధార్ అందిస్తామన్నారు. భూ పటాలను ప్రక్షాళన చేయాలన్నారు. పక్కగా భూ రీసర్వే చేసి హద్దులను నిర్ణయించేందు కే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం టేక్మాల్ మండలంలో విలేజ్ బౌండరీ సంబంధిత తాసిల్దార్ తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దు వివాదాలకు తావు లేకుండా రైతులకు మేలు చేకూరే విధంగా పటిష్ట ప్రణాళిక ద్వారా ఈ కార్యక్రమం ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,స్థానిక తహసిల్దార్, రెవెన్యూ అధికారులు, గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవన నిర్మాణాలకు స్థల పరిశీలన చేయాలి

◆ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జులై 17 (జన సంఘర్షణ)



జిల్లాలోని నూతన మండలాలలో తహసిల్దార్ కార్యాలయానికి,సబ్ రిజిస్టర్ కార్యాలయాల నూతన భవన నిర్మాణానికి స్థలం సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నుంచి గూగుల్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. నూతన మండలాలైన హవేలీ ఘనపూర్ ,నిజాంపేట, చిలిపిచేడు మండలాలకు తహసిల్దార్ కార్యాలయ నిర్మాణానికి భూసేకరణ త్వరితగతిన చేపట్టాలన్నారు. మెదక్, నర్సాపూర్, రామాయంపేట డివిజన్ పరిధిలో రిజిస్టర్ కార్యాలయ భవన నిర్మాణం కోసం స్థల సేకరణను వేగవంతం చేసి , స్థల సేకరణ సంబంధిత ఫైల్లను ఉన్నతాధికారులకు నివేదించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం,ఆర్డీవోలు, రమాదేవి, రామకృష్ణ బవయ్య,తహసిల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ. లక్షకు మగ శిశువును విక్రయించిన తల్లిదండ్రులు

మహబూబ్‌నగర్, జూలై 17 (జన సంఘర్షణ):



మహబూబ్‌నగర్ రూరల్ మండలం తెలుగుగూడెం గ్రామంలో కన్న బిడ్డనే విక్రయించిన దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, జూన్ 16న జన్మించిన మూడో మగ శిశువును తల్లిదండ్రులు కేశవులు, నీలమ్మ రూ.1 లక్షకు విక్రయించినట్లు వెల్లడైంది. టీకాలు వేయించేందుకు శిశువును ఆసుపత్రికి తీసుకురావాల్సి ఉండగా, బాబు కనిపించకపోవడంతో వైద్య సిబ్బంది ఆరా తీశారు. దీనిపై తల్లిదండ్రులు శిశువు మరణించాడని చెప్పడంతో అనుమానం వ్యక్తమైంది. అనంతరం పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు విచారణ చేపట్టగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఒక మధ్యవర్తి ద్వారా హన్వాడ మండలానికి చెందిన వ్యక్తులకు శిశువును రూ.1 లక్షకు విక్రయించినట్లు తల్లిదండ్రులు విచారణలో అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## నాణ్యమైన విద్య అందించాలి..

◆ ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం..

◆ హెచ్చరించిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్..

నాగర్ కర్నూల్/ జులై 17 /(జన సంఘర్షణ)



ప్రభుత్వ పాఠశాలల్లో విద్య ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని కూడా అనుమతించబోమని, నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ శుక్రవారం హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడ్డ విద్య వ్యవస్థలో ఉపాధ్యాయుల బాధ్యత అత్యంత కీలకం కావడంతో విధుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తప్పదని ఆయన పేర్కొన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి హాజరు నమోదు, తరగతుల నిర్వహణ, బోధన పద్ధతులు, పుస్తకాల వినియోగం, విద్యార్థుల అభ్యాస స్థాయి మరియు పాఠశాల నిర్వహణలను స్వయంగా పరిశీలించారు. మొత్తం ఐదుగురు ఉపాధ్యాయుల్లో ఒకేసారి ముగ్గురు ఉపాధ్యాయులు విధులకు రాని సంఘటన కలెక్టర్‌కు అవగాహన వచ్చింది. ప్రధాన ఉపాధ్యాయుడు శంకర్‌తో పాటు లావణ్య, మానస హాజరుకాలేదని గుర్తించారు.

## మెదక్ జిల్లాను సర్వనాశనం చేసి రామాయంపేట నియోజకవర్గాన్ని పూర్తిగా తుంగలో తొక్కిన ఘనత మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి

◆ మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షుడు

◆ వాళ్దాస్ రాధా మల్లేష్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, పంజా విజయ్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూలై 17 (జన సంఘర్షణ)





మెదక్ జిల్లా రామాయంపేట శివారులోని శ్రీ ఆద్య హోటల్ వద్ద వై-జంక్షన్ వద్ద జరిగిన ప్రతిరక్తాపాతానికి,అమాయకుల ప్రాణాలు పోవడానికి ఆమె అనుసరించిన చౌకబారు స్వార్థ రాజకీయాలే కారణం అని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ రాధా మల్లేష్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, మాజీ నిజాంపేట జెడ్పీటిసి సభ్యుడు పంజా విజయ్ కుమార్ నిప్పులు చెరిగారు.శుక్రవారం రామాయంపేట మండల కేంద్రంలో జరిగిన రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ హర్షోద్వేగాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాజీ ఎమ్మెల్యేపై మునుపెన్నడూ లేని రీతిలో అత్యంత ఘాటుగా విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రమాదాలకు నిలయంగా మారి నిత్యం మృత్యుఘోషతో అల్లాడుతున్న వై-జంక్షన్ బ్లాక్ స్పాట్ వద్ద గతంలో బ్రిడ్జి నిర్మాణ పనులు, అత్యవసర సమయంలో చేస్తుంటే, ఓర్వలేక రాజకీయ దురుద్దేశాలతో పనులను అడ్డుకుని నిలిపివేయించడమే కాకుండా,ఏకంగా వై-జంక్షన్ బ్రిడ్జి ప్రాజెక్టునే క్యాన్సల్ చేయించిన దుర్మార్గపు చరిత్ర పద్మా దేవేందర్ రెడ్డిదని ధ్వజమెత్తారు.అక్కడ జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాల వెనుక, కోల్పోయిన అమాయక ప్రాణాల వెనుక ఉన్నది ముమ్మాటికీ మాజీ ఎమ్మెల్యేనేనని, ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రమాద బాధితుల కుటుంబాలకు ఆమే సొంతంగా భారీ నష్టపరిహారం చెల్లించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు.అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో మెదక్ జిల్లాను అధోగతి పాలు చేసి, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎంపీ రఘునందన్ రావు అహర్నిశలు శ్రమించి మంజూరు చేయించిన



రూ.47 కోట్ల 21 లక్షల 39 వేల 929 రూపాయల భారీ ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులపై బీఆర్ఎస్ నాయకులు వారి పరువు ప్రతిష్టలు గంగలో కలిసేలా క్రెడిట్ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ద్వారా రఘునందన్ రావు ఈ నిధులు సాధించారని, రాబోయే రెండు నెలల్లోనే ఈ పనులు శరవేగంగా ప్రారంభం కానున్నాయని, తెలంగాణలో త్వరలోనే డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ?ఈ చారిత్రాత్మక విజయానికి కృతజ్ఞతగా రామాయంపేట పట్టణ అధ్యక్షుడు అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో మెదక్ చౌరస్తాలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ, నితిన్ గడ్కరీ, ఎంపీ రఘునందన్ రావు చిత్రపటాలకు బీజేపీ శ్రేణులు, ప్రజలు కలిసి ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు, రామాయంపేట మున్సిపాలిటీ కౌన్సిలర్ శంకర్ గౌడ్, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, పబ్బసత్యం,దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాటరాజు,ఎస్సీ మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షుడు మస్కూరి బాలరాజు, గోపి శెట్టి రమణ, చిన్నమైన శ్రీనివాస్, చింతల శేఖర్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేశారు.


## వినాయక్ నగర్‌లో విద్యుదాఘాతానికి గురైన లైన్‌మ్యాన్

◆ ఇన్వర్టర్ విద్యుత్ సరఫరాతో ప్రమాదం.. చికిత్స పొందుతున్న ప్రైవేటు వర్కర్

నిజామాబాద్ క్రైం, జూలై 17 (జనసంఘర్షణ):

నిజామాబాద్ నగరంలోని హైదరాబాద్ రోడ్డులో గల వినాయక్ నగర్‌లో విద్యుత్ లైన్‌ల మరమ్మత్తు పనులు చేస్తుండగా ఓ ప్రైవేటు లైన్‌మ్యాన్ విద్యుదాఘాతానికి గురైన ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. సమయస్ఫూర్తితో స్పందించిన తోటి సిబ్బంది, విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. వినాయక్ నగర్‌లోని విశాల్ మార్ట్ ఎదురుగా ప్రైవేటు కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో విద్యుత్ లైన్‌ల మరమ్మత్తు పనులు చేపట్టారు. ఇందుకోసం ముందుగా సంబంధిత సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ (లైన్ క్లియర్) తీసుకుని, నగరంలోని ఇంద్రాపూర్‌కు చెందిన ప్రశాంత్ అనే ప్రైవేటు వర్కర్‌ను విద్యుత్ స్తంభంపైకి ఎక్కించి పనులు ప్రారంభించారు. అయితే, పనులు జరుగుతున్న సమయంలో సమీపంలోని ఇన్వర్టర్ (జనరేటర్) ద్వారా విద్యుత్ సరఫరా లైన్‌లోకి రావడంతో ప్రశాంత్ ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. విషయం గమనించిన తోటి కార్మికులు వెంటనే





విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించగా, వారు సరఫరాను నిలిపివేశారు. అనంతరం ప్రశాంత్‌ను సురక్షితంగా స్తంభం నుంచి కిందకు దించి, అపస్మారక స్థితిలో ఉండటంతో శ్రీనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ ఘటనపై విద్యుత్ శాఖ ఏడీఈ వినోద్‌ను వివరణ కోరగా, ప్రైవేటు కాంట్రాక్టర్ ద్వారా మరమ్మత్తు పనులు జరుగుతున్న విషయం వాస్తవమేనని తెలిపారు. ఘటన గురించి తనకు ఆలస్యంగా సమాచారం అందిందని, పూర్తి వివరాలు సేకరించి తెలియజేస్తామని చెప్పారు. స్థానికులు మాత్రం విద్యుత్ లైన్‌ల మరమ్మత్తు సమయంలో భద్రతా ప్రమాణాలు మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## బంగారు గొలుసు దోపిడీ కేసులో నిందితుడు అరెస్ట్

◆ బంగారు గొలుసు దోపిడీ కేసు లో నిందితుడు అరెస్ట్

బాన్సువాడ ప్రతినిధి./జూలై 17/( జన సంఘర్షణ)



బాన్సువాడ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో జరిగిన బంగారు గొలుసు దోపిడీ కేసును బాన్సువాడ పోలీసులు ఛేదించి నిందితుడిని అరెస్టు చేశారు. తేదీ 15.07.2026 రాత్రి సుమారు 8:00 గంటల సమయంలో శాంతినగర్ కాలనీ, బాన్సువాడకు చెందిన బెజిగం రమేష్ తన ఇంటి వద్ద ఉండగా, నిందితుడు అతని ఇంటికి వెళ్లి తాను ఎక్సైజ్ శాఖకు చెందిన అధికారినని నమ్మించి, కిరాణా దుకాణంలో మద్యం సీసాలు విక్రయిస్తున్నారనే సమాచారం వచ్చిందని, తనిఖీ చేయాల్సి ఉందని చెప్పి, కిరాణా దుకాణాన్ని పరిశీలించాడు. అనంతరం ఇంట్లో కూర్చొని ఉండగా, రమేష్ నీళ్లు తాగేందుకు లోపలికి వెళ్లిన సమయంలో నిందితుడు ఒక్కసారిగా అతనిపై దాడి చేసి కిందపడవేసి, అతని మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే బాన్సువాడ పోలీస్ స్టేషన్ తుల శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకొని ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో నిందితుడిని బత్తుల మునీశ్వర్: బ్రాంచ్ పోస్టుమాస్టర్, దుర్కి గ్రామంగా గుర్తించారు. విచారణలో నిందితుడు చాలా కాలంగా క్రికెట్ బెట్టింగ్లు , ఆన్లైన్ గేమింగ్లకు అలవాటు పడి, పోస్టాఫీసుకు సంబంధించిన సుమారు రూ.12 లక్షల ప్రభుత్వ నిధులను బెట్టింగ్లలో కోల్పోయినట్లు తెలిసింది. అనంతరం శాఖాపరమైన విచారణలో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లించినప్పటికీ, ఇంకా రూ.42,000/- బకాయి ఉండటంతో అతడిని విధుల నుండి సస్పెండ్ చేసినట్లు వెల్లడైంది. సస్పెన్షన్ అనంతరం కూడా తన బెట్టింగ్ అలవాటును కొనసాగించేందుకు డబ్బు సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో అంగీకరించాడు. శుక్రవారం నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుండి దొంగిలించిన సుమారు 23 గ్రాముల బంగారు గొలుసు , నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్ , మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని జ్యుడిషియల్ రిమాండ్కు తరలించనైనది. ఇట్టి కేసు ను 24 గంటలలో నిందితుని పట్టుకునిన ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ క్రైమ్ టీం ఆయన హెడ్ కానిస్టేబుల్ సాయికుమార్ , కానిస్టేబుళ్లు పాండురంగ, సుదర్శన్ రావు, పృథ్వీరాజ్, లను అభినందించడమైనది.బాన్సువాడ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ప్రభుత్వ అధికారులమని చెప్పి ఇళ్లలోకి లేదా వ్యాపార సంస్థల్లోకి వచ్చే వ్యక్తుల వివరాలను ధృవీకరించుకుని మాత్రమే సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని బాన్సువాడ డ.ఎస్.పి విట్టల్ రెడ్డి సూచించారు..

జన సంఘర్షణ

శనివారం
18 జులై 2026

# పోచారం మీ చేతులతో ప్రారంభించిన నర్సరీ కబ్జాకు గురైంది కాస్త చూడరు..

రుద్రుడు వర్ని/ ప్రతినిధి /జూలై 17/(జనసంఘర్షణ)

రుద్రూర్ మండల కేంద్రంలోని అక్బర్ నగర్ గ్రామంలో కబ్జాల పర్వం జరుగుతూనే ఉంది. ఇటీవల మండల్ అధికారి సైతం అంగీకరించారు. అక్కడ ఉన్న సెక్రటరీలు స్థానిక ప్రభుత్వ స్థలాలను అక్రమంగా కబ్జా చేసుకున్నట్లు మండల అధికారి బాలగంగాధరే తెలపడం జరిగింది. ముఖ్య విషయం సర్వే నంబర్ 246/21-2022 లో స్పీకర్ పదవిలో ఉన్న బాన్స్వాడ పోచారం శ్రీనివాస్ రెడ్డి ఈ సర్వే నెంబర్లు ప్రభుత్వ నర్సరీని స్వయంగా ప్రారంభించడం జరిగింది. పక్క ప్రభుత్వ రెవిన్యూ భూమి రెండు సంవత్సరాల పాటు అక్బర్ నగర్ గ్రామంలో సుమారు ఎకరం ప్రాంతంలో హరితహారం మొక్కలను పెంచడం జరిగింది ప్రారంభించిన హరితహారం స్థలాన్ని సైతం కొందరు తమ పేర్లపై మార్పిడి చేసుకోవడం జరిగినట్ల ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది ప్రభుత్వ అధికారులు గుప్పెట్లో పెట్టుకొని, ప్రభుత్వ హరితహారానికి సంబంధించిన నర్సరీని సైతం కబ్జా చేసుకోవడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఆ నర్సరీని కూడా తమ తమ సొంత భూమి అంటూ దున్నుతున్నారు అంటే అధికార పార్టీకి చెందిన కొందరు, శంకుస్థాపన చేసిన వాటిని కబ్జాలు చేసుకుని అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్బర్ నగర్లో కబ్జాలు అవుతున్న మాట వాస్తవమే..? కబ్జాల వెనుక ఎంతమంది పెద్దలు, ప్రభుత్వ అధికారుల హస్తం లేనిదే ఇన్ని కబ్జాలకు పాల్పడతారా..? అంటూ ఒక మండల అధికారి బహిరంగంగా చెప్పడమే పెద్ద దుమారాన్ని లేపింది..? మరి గతంలో స్పీకర్గా పనిచేసిన పోచారం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన నర్సరీలో సైతం కబ్జా చేసుకున్న వారిపై ప్రస్తుత సలహాదారుడుగా ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి ఎంత మేరకు చర్యలు తీసుకుంటారుఅన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది. నిజమైన నిరుపేదలు అన్ని ఉన్న వారికే స్థలాలు కేటాయించడంపై గ్రామంలో పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి, అయినా ఇల్లు చక్కకుండాంగానే దీపం పెట్టుకోవాలన్న అధికార బలంతో భూముల కబ్జాకు



పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించి అక్బర్ నగర్లో కొనసాగుతున్న భూ బాగోతంపై చర్యలు తీసుకున్న విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# దేశంలో తొలి హైడ్రోజన్ రైలు ప్రారంభించిన పిఎం

- పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తొలి హైడ్రోజన్ రైలు





హైదరాబాద్/జులై 17/(జన సంఘర్షణ)

భారతదేశంలో హైడ్రోజన్ రైలు ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం ప్రారంభించారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తొలి హైడ్రోజన్ రైలు రూపుదిద్దుకుంది. హర్యానాలోని జిందు బిసోనీ వత్తు స్టేషన్ల మధ్య హైడ్రోజన్ రైలు పరుగులు పెడుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెల్లడించారు. హైడ్రోజన్ రైలుతో పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని, ఈ సందర్భంగా నరేంద్ర మోడీ పేర్కొన్నారు. హర్యానాలోని జిండ్ స్టేషన్లో హైడ్రోజన్ రైలును పచ్చజెండా ఊపి నరేంద్ర మోడీ ప్రారంభించారు. దేశంలోనే తొలి హైడ్రోజన్ రైలుగా ఇది గుర్తింపబడింది. తన దృష్టి ఎప్పుడు సమస్యల పరిష్కారం పైనే ఉంటుందని ఈ సందర్భంగా నరేంద్ర మోడీ పేర్కొన్నారు. తాము ఏమి చేసినా ముందుచూపుతోనే పనిచేస్తామని ప్రధాని వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చాక 12 ఏళ్లలో రైల్వేలో విద్యుదీకరణ 99 శాతానికి పెంచామని ప్రధాని గుర్తు చేశారు. 2014 వరకు రైల్వేలో విద్యుత్ కరణ కేవలం 30 శాతం మాత్రమే ఉందని ప్రధాని పేర్కొన్నారు. చమురు సరఫరా కీలక మార్గంలో అనిచ్చితి నెలకొందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. కొన్ని నెలలుగా పచ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం వల్ల భారతదేశంలో చమురు సమస్య రాకుండా తమ ప్రభుత్వం ప్రత్యామ్నయ ఏర్పాట్లలో ఉందని ప్రధాని వెల్లడించారు. గత 12 ఏళ్లలో తమ రైల్వేలలో కీలక మార్పులు వచ్చాయని, మిగతా దేశాలు హైడ్రోజన్ రైలు కంటే మన దేశంలో తయారైన హైడ్రోజన్ రైలుకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయని ప్రధాని పేర్కొన్నారు. జిందు- సోనీ పత్ హైడ్రోజన్ రైలుకు 10 కోచులతో నడుస్తుందని ప్రధాని వెల్లడించారు. హైడ్రోజన్ రైలు రైల్వే ట్రాక్ పై సరికొత్త విప్లవానికి నాంది పలికిందని ప్రధాని స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరిన్ని హైడ్రోజన్ రైలు లు వస్తాయని ప్రధాని పేర్కొన్నారు. దేశ ప్రజలంతా స్వచ్ఛత మంత్రం పట్టిద్దాం అంటూ ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. హైడ్రోజన్ రైలు జిందూ -సోనీ పత్ మధ్య 89 కిలోమీటర్ల దూరం నడుస్తుందని ప్రధాని తెలిపారు. రూ. 14000 కోట్లతో రైల్వే రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు. రైల్వే రూపు రేఖలు మార్చడంలో ఇది కీలకమైన అడుగు అంటూ ప్రధాని పేర్కొన్నారు. హైడ్రోజన్ రైలుతో హర్యానాకు పేరు చిరస్థాయిగా నిలుస్తుందని ప్రధాని వెల్లడించారు. పర్యావరణ రహిత ప్రాజెక్టులలో భాగంగానే హైడ్రోజన్ రైలు అంటూ ప్రధాని గుర్తు చేశారు. రైల్వేలో డీజిల్ విద్యుత్ వినియోగం తగ్గిస్తామని ప్రధాని వెల్లడించారు. భవిష్యత్తు అంతా హైడ్రోజన్ దేనని ప్రధాని పేర్కొన్నారు హైడ్రోజన్ రైల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు నరేంద్ర మోడీ అభివాదం తెలిపారు..

# బోధన్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్

- మౌలిక సదుపాయాలను పెంపొందించేందుకు నిధులు మంజూరు
- మెరుగైన సేవల ద్వారా ఆసుపత్రికి ప్రత్యేక గుర్తింపు కల్పిస్తామని వెల్లడి
- హాస్పిటల్ అభివృద్ధిపై అధికారులతో సమీక్ష
- పక్షం రోజులకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని ఆదేశం
- ఆసుపత్రిలో అపరిశుభ్రతపై కలెక్టర్ అసంతృప్తి
- పారిశుధ్య కాంట్రాక్టు ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశం



నిజామాబాద్ బ్యూరో./జూలై 17/( జనసంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. ఆసుపత్రిలోని అవుట్ పేషంట్ బ్లాక్, కాన్పుల విభాగం, ఇమ్యూనైజేషన్ గది, పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ తదితర విభాగాలను సందర్శించి అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణను, శిథిలావస్థకు చేరిన ఐసోలేషన్ వార్డు భవనాన్ని పరిశీలన జరిపారు. ఆసుపత్రి ఆవరణ, పరిసరాలు అపరిశుభ్రంగా



ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుధ్య కాంట్రాక్టు ఏజెన్సీకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. పరిస్థితిలో మార్పు రాకపోతే కాంట్రాక్టు రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డితో కలిసి బోధన్ ఆర్డీఓ విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇతర వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రి రికార్డులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన బ్యాంకు స్టేట్ మెంట్లను నిశితంగా పరిశీలించారు. ఆసుపత్రిలో నెలకొని ఉన్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం నిధులు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. బాన్సువాడ తో పాటు సరిహద్దు ప్రాంతాల నుండి గర్భిణీలు ఈ ఆసుపత్రిని సందర్శిస్తున్నారని, ప్రతి నెల సగటున 200 వరకు కాన్పులు జరుగుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆసుపత్రిలో బర్త్ వెయిటింగ్ రూం ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మెడికో లీగల్ కేసులు కూడా ఎక్కువగానే వస్తున్నందున, భద్రతాపరమైన అంశాల రీత్యా బోధన్ ఆసుపత్రిలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా పోలీసు శాఖకు ప్రతిపాదిస్తామని తెలిపారు. వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై నమ్మకాన్ని పెంపొందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ హితవు పలికారు. వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ రోగులకు నాణ్యమైన సేవలు అందించేలా అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అవసరమైన మౌలిక సదుపాయాలను, వైద్యులను, సిబ్బందిని సమకూరుస్తామని, అయినా కూడా వైద్య సేవలలో లోపాలు ఉంటే ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు జరుపుతానని, నిర్లక్ష్యానికి తావు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు. స్థానిక ఆర్డీఓ నేతృత్వంలో ప్రతి పక్షం రోజులకు ఒకసారి సమీక్షా సమావేశం నిర్వహించి, ఆసుపత్రి నిర్వహణ తీరుతెన్నులపై తనకు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, తహసీల్దార్ విఠల్, స్థానిక వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలి

- ఎంపీ సురేష్ షెట్కర్ వెల్లడి
- దిశా సమావేశంలో జిల్లా అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

కామారెడ్డి బ్యూరో /జూలై 17/(జన సంఘర్షణ)







ప్రభుత్వ పథకాల అమలులో సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీ సురేష్ షెట్కర్ చెప్పారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో దిశ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు, జిల్లా దిశా కమిటీ చైర్మన్ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యుడు సురేష్ షెట్కర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సకాలంలో అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.వ్యవసాయం, నీటిపారుదల, రహదారులు, రహదారి భద్రత, బ్యాంకింగ్, విద్య, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించి, కిసాన్ క్రెడిట్ కార్డులు, పంట బీమా, ఇతర ఆర్థిక సహాయ పథకాల అమలును మరింత వేగవంతం చేయాలని పేర్కొన్నారు.జాతీయ రహదారులపై రహదారి ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, తాగునీరు, సాగునీటి సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులకు ఆరుతడి పంటలపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి ఒక్కరికి ఉపాధి లభించేలా క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి తనవంతుగా సహకారం అందించి అభివృద్ధి పనులను వేగవతానికి కృషి చేస్తానని, ప్రజలకు కావలసిన మౌలిక వసతులను సంబంధిత శాఖ అధికారులు కల్పించాలన్నారు. అనంతరంజిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు చేసిన సూచనలను సంబంధిత శాఖలు కార్యాచరణ ప్రణాళికతో అమలు చేయాలని, శాఖల మధ్య సమన్వయం పెంపొందించి అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర. మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి. అదనపు కలెక్టర్ విక్టర్ అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ యన్ వై గిరి. డి ఆర్ డి ఏ దామోదర్ రెడ్డి.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సాలూరా మండలంలో మంజీరా నది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



సాలూరా/జులై 17/(జనసంఘర్షణ (

సాలూరా మండలంలోని మంధర్నా, తగ్గేలి గ్రామాల పరిసరాల్లోని మంజీరా నది నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రతి రోజు రాత్రి వేళల్లో పదుల సంఖ్యలో ఇసుకతో నిండిన ట్రాక్టర్లు బోధన్ వైపు తరలిపోతున్నాయని వారు చెబుతున్నారు. అంతేకాకుండా, తగ్గేలి గ్రామ సమీపంలోని మంజీరా నది నుంచి డోజర్ల సహాయంతో కూడా రాత్రివేళల్లో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అక్రమ రవాణా జరుగుతున్న మార్గాల్లో పోలీసు సిబ్బంది ఉన్నప్పటికీ, ఇసుక వాహనాలు ఎలాంటి ఆటంకం లేకుండా వెళ్లిపోతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తక్షణమే స్పందించి, అక్రమ ఇసుక రవాణాకు సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సాటాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం

- బొలెరో-బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు





రెంజల్,/ జూలై 17/ (జనసంఘర్షణ):

రెంజల్ మండలం సాటాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, బొలెరో వాహనం, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికుల సహాయంతో వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై వివరాలు సేకరిస్తూ దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# సైబర్ నేరాలపై ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి

- సుజాతనగర్ పోలీస్ స్టేషన్ సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.
- సైబర్ నేరాలపై ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలి.
- సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలి







సుజాతనగర్/: జులై 17/(జన సంఘర్షణ)

వార్షిక తనిఖీలలో భాగంగా శుక్రవారం నాడు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ముందుగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ పుష్పగుచ్ఛం అందించి జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనాల సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల షెడ్‌ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అధికారులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని ఎస్పీ సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని, సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య అందుబాటులో ఉన్న సాంకేతిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో వర్టికల్స్ వారీగా విధులు నిర్వర్తించే సిబ్బందిని ఒక్కొక్కరిగా వారి పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయల్-100కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీతో పాటు అధికారులు పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, ఎస్సై రమాదేవి , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికపై ముగ్గురు ఆటో డ్రైవర్ల పైశాచికం!

- ప్రేమ పేరుతో ఒకడు, వీడియోలు ఉన్నాయంటూ ఇద్దరు..



సుజాతనగర్/జులై 17/ (జనసంఘర్షణ)

ప్రేమించానంటూ వెంట పడ్డాడు.. పెళ్లి పేరుతో వంచించాడు. చిన్న వయస్సులోనే తండ్రిని కోల్పోయి, తల్లి రెక్కల కష్టాన్ని నమ్ముకొని జీవిస్తున్న ఓ మైనర్ బాలికపై ముగ్గురు కామాంధులు ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ దారుణ ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు నలుగురు నిందితులును కొత్తగూడెం పోలీసులు అరెస్ట్ చేయగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ప్రేమ పేరుతో వెంటపడ్డాడు. పెళ్లి చేసుకుంటానంటూ ఏమార్చాడు. స్నేహితుడి గదికి తీసుకెళ్లి కామ వాంఛ తీర్చుకున్నాడు. అంతటితో ఆగకుండా తన స్నేహితులను కూడా అనుభవించండి అంటూ ఉసిగొలిపాడు. ఎవరికి వారు 14 ఏళ్ల బాలికపై వేర్వేరుగా ఒక్కో రోజు ఒక్కో స్థలంలో తిప్పుతూ అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత కూడా పదేపదే తాము చెప్పినచోటుకి రావాలంటూ బెదిరింపులు వస్తుండటంతో ఆ బాలిక తల్లికి విషయం చెప్పింది. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రమేయం ఉన్న మొత్తం ఆరుగురిపై పోక్సో కేసు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సుజాతనగర్ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికను అదే గ్రామా నికి చెందిన ఆటో డ్రైవర్ మార్తి రామకృష్ణ (21) ప్రేమిస్తున్నా నంటూ నమ్మబలికాడు. పెళ్లి చేసుకోవడానికి మా స్నేహితుడి సలహా తీసుకుందాం అంటూ ఈ నెల 3న తన ఇద్దరు స్నేహితు లైన అదే గ్రామానికి చెందిన జాలై నవీన్ (26), గణేశ్ సాయంతో ఆటోలో పాత ఆర్టీసీ డిపో సమీపంలో అద్దెకు ఉంటున్న తన బంధువు, బెటాలియన్ కానిస్టేబుల్ వెంకటేశ్ గదికి తీసుకెళ్లారు. స్నేహితులను పంపించేసి బాలికపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమెను ఇంటికి పంపించిన తర్వాత తోటి ఆటో డ్రైవర్లు, బడేటి మహేశ్ , విజేందర్ లకు జరిగిన విషయం చెప్పాడు. ఇదే అదనుగా నీ వీడియోలు మా దగ్గర ఉన్నాయంటూ ఆ ఇద్దరూ బాలికను బెదిరించారు. వీడియోలు, ఫొటోలు బయటికి రాకుండా ఉండాలంటే తమతో పాటు శారీరకంగా కలవాలని బలవంతం చేశారు. ఎవరికి చెప్పకుండా మేము చెప్పిన ప్రదేశానికి రావాలంటూ ఒత్తిడి చేశారు. బాలికను బెదిరించి ఈ నెల 4న కలకుంట్ల విజేందర్, 5న బడేటి మహేశ్ ఆటోల్లో వేర్వేరు నిర్మానుష్య ప్రదేశాలకు తీసు కెళ్లి పైశాచికంగా బాలికను అనుభవించారు. మళ్లీ మళ్లీ రావా లంటూ వేధింపులు పెరగడంతో బాలిక జరిగిన విషయాన్ని ఈ నెల 11న తల్లికి చెప్పడంతో అదే రోజు పోలీసులకు పిర్యాదు. చేశారు. పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు రామకృష్ణ, విజేం దర్, మహేశ్, నవీన్ను అరెస్టుచేశారు. వీరికి సహకరించి ఇంటి రూమ్ ఇచ్చిన కానిస్టేబుల్ వెంకటేశ్, గణేష్ పరారీలో ఉన్నారు.

# బస్టాండ్ లో దారుణం.. ప్రేమ నిరాకరించిందని బంధువు దాడి!



కర్ణాటక/జూలై 17/( జనసంఘర్షణ)

మంగుళూరు: కర్ణాటకలో దారుణ ఘటన చోటుచేసుకుంది. బస్టాండ్ లో బస్సు కోసం ఎదురుచూస్తున్న యువతిపై ఓ వ్యక్తి మారణాయుధంతో దాడి చేసి హత్య చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు ప్రేమ వ్యవహారమే కారణమై ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కాగా, బంట్వాల్లోని కేఎస్ఆర్టీసీ న్యూ బస్ స్టాండ్ వద్ద గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. మృతురాలిని లావణ్యగా గుర్తించారు. ఆమె కక్కేపదవు ప్రాంతానికి చెందిన యువతిగా,కళ్లడ్కలోని ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్ లో పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. లావణ్య బస్సు కోసం వేచి ఉండగా నిందితుడు ఆమె వద్దకు వచ్చాడు. అనంతరం తన బ్యాగులో నుంచి పదునైన ఆయుధాన్ని తీసి దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. దాడి నుంచి తప్పించుకునేందుకు ఆమె ప్రయత్నించినా, నిందితుడు వెంటాడి దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తీవ్ర గాయాలతో ఉన్న లావణ్యను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనలో నిందితుడిగా చేతన్ అనే వ్యక్తిని పోలీసులు గుర్తించారు. అతడు మృతురాలికి దూరపు బంధువని, కొంతకాలంగా ఆమెను వేధిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లావణ్య తన ప్రేమను తిరస్కరించడంతో నిందితుడు ఈ దారుణానికి పాల్పడి ఉండొచ్చనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి కారణాలు దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టమవుతాయని అధికారులు తెలిపారు. ఈ దాడి అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. అతడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. బంట్వాల్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇక, బస్టాండ్ వంటి బహిరంగ ప్రదేశంలో జరిగిన ఈ హత్య స్థానికుల్లో భయాందోళనలు కలిగించింది. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దీంతో, నగరంలో మహిళల భద్రతపై మరోసారి చర్చ మొదలైంది.

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కొత్త ఆరోగ్య భద్రత..

- 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్' ప్రారంభం




హైదరాబాద్/జూలై 17/(జన సంఘర్షణ)

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 'న్యూ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను ప్రారంభించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి, ఉద్యోగులకు హెల్త్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలోని సుమారు 8 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లుతో పాటు వారిపై ఆధారపడిన 29.80 లక్షల మంది కుటుంబ సభ్యులకు ఈ పథకం ద్వారా సంపూర్ణ నగదు రహిత వైద్య సేవలు అందనున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 886 ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ఇన్‌పేషెంట్ వైద్య సేవలు పొందే అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం పరిధిలోని 1,816 రకాల వైద్య, శస్త్రచికిత్సలకు పూర్తి కవరేజ్ ఈ పథకంలో అందుబాటులో ఉంటుందని చెప్పారు. పథకం పారదర్శకంగా అమలయ్యేలా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమాన భాగస్వామ్యంతో ప్రత్యేక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిన కారణంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు రూ.10 వేల కోట్ల వైద్య బిల్లులను కూడా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో క్లియర్ చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వ కుటుంబ సభ్యులేనని, వారు వైద్య ఖర్చుల కోసం అప్పులపాలు కాకూడదనే మానవీయ దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పేదలకు సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు రెట్టింపు ఉత్సాహంతో, నిబద్ధతతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పొలానికి నీళ్లు పారిస్తానని వెళ్లి కౌలు రైతు మృతి



బాన్సువాడ/జూలై 17 /(జన సంఘర్షణ)

బాన్సువాడ పొలానికి నీళ్లు పారిస్తానని వెళ్లిన రైతు మృతి చెందాడు. ఈ ఘటన పాత బాన్సువాడ లోని శాంతినగర్లో చోటుచేసుకుంది.

**బురదలో పడటంతో....**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత బాన్సువాడలోని శాంతినగర్ కాలనీకి చెందిన దేశాయిపేట్ నారాయణ (45) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గురువారం రాత్రి 10 గంటల సమయంలో నారాయణ తాను కౌలుకు చేస్తున్న పొలానికి నీరు పారించేందుకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం 7 గంటలైనా నారాయణ ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య సుజాత అతడి కోసం పొలం వద్దకు వెళ్లింది. ఉదయం సుమారు 8 గంటల సమయంలో పొలాల మధ్య ఉన్న మట్టి రోడ్డుపై నారాయణ మృతి చెంది ఉండడాన్ని ఆమె గుర్తించింది. ఈ విషయాన్ని వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి వరి పంటకు నీరు పారించి ఇంటికి తిరిగి వస్తుండగా, వర్షం కారణంగా బురదగా మారిన నల్లరేగడి రోడ్డుపై కాలు జారి బోర్లా పడడంతో బురద నీటిలో శ్వాస ఆడక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

# హెడ్‌మాస్టర్ సస్పెండ్...




తుంగతుర్తి/జులై 17/( జన సంఘర్షణ)

తుంగతుర్తి మండలంలోని బండరామారం జడ్పీహెచ్ఎస్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల)లో చోటుచేసుకున్న ఘటన జిల్లా విద్యాశాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పాఠశాలలో కొంతకాలంగా కొనసాగుతున్న ఉపాధ్యాయుల మధ్య విభేదాలు చివరకు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపడంతో జిల్లా విద్యాశాఖ అధికారులు సీరియస్‌గా స్పందించారు. పాఠశాలలో హెడ్‌మాస్టర్ హకీమ్‌తో పాటు కొందరు ఉపాధ్యాయుల మధ్య కొంతకాలంగా పరిపాలన, విధుల నిర్వహణకు సంబంధించిన విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ అంతర్గత వివాదాలు పాఠశాల విద్యా వాతావరణాన్ని దెబ్బతీయడమే కాకుండా, విద్యార్థుల చదువుల పై కూడా ప్రతికూల ప్రభావం చూపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో హెడ్‌మాస్టర్ హకీమ్ అత్యంత వివాదాస్పద నిర్ణయం తీసుకుని పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీలు) జారీ చేసినట్లు సమాచారం. ఉపాధ్యాయుల మధ్య నెలకొన్న వివాదాన్ని విద్యార్థులపై చూపించడం ఏమిటని తల్లిదండ్రులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్త మీద కోపం దుత్త మీద చూపించినట్లుగా హెడ్మాస్టర్ వ్యవహరించారని వారు విమర్శిస్తున్నారు. విషయం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) అశోక్ దృష్టికి చేరడంతో ఆయన వెంటనే విచారణకు ఆదేశించారు. ప్రాథమిక విచారణలో హెడ్మాస్టర్ చర్యలు విధి విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించిన డీఈఓ అశోక్, హెడ్మాస్టర్ హకీమ్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా, పాఠశాలలో నెలకొన్న పరిస్థితులకు బాధ్యత వహించాల్సిన నలుగురు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం, విద్యా బోధనకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డీఈఓ స్పష్టం చేసినట్లు తెలిసింది.

# విద్యార్థులకు పురుగుల అన్నం... నీళ్ల చారు

- విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం...
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ అధికారులు
- పురుగుల అన్నంపై గ్రామ సర్పంచ్ సునీత ఆగ్రహం



రుద్రూర్, జూలై 17 (జన సంఘర్షణ):

నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపించడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న ఏజెన్సీ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నాణ్యతలేని ఆహారం అందిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. శుక్రవారం గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత చంద్రశేఖర్, ఉపసర్పంచ్ నిస్సార్, ఎంపీడీఓ బాల గంగాధర్, ఎంపీఓ అరవింద్, గ్రామ కార్యదర్శి ప్రేమ్ దాస్‌లతో కలిసి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యం బస్తాల్లోనే కాకుండా వండిన అన్నంలో కూడా పురుగులు కనిపించడంతో వారు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వంటకు వినియోగించిన బియ్యం పూర్తిగా పురుగులమయంగా ఉండటంతో మధ్యాహ్న భోజనం నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు మాట్లాడుతూ.. వారానికి మూడు సార్లు గుడ్లు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ వాటిని అందించడం లేదని, పప్పుచారు కూడా నీళ్లలా పలుచగా ఉంటోందని సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు, నాణ్యతలేని ఆహారం అందిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, మధ్యాహ్న భోజనం నాణ్యతపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
శనివారం
18 జులై 2026

## మా పాఠశాలపై అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు

- ఢిల్లీ వరల్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రియ హెచ్చరిక

నిజామాబాద్/బాల్కొండ, జూలై 17 (జనసంఘర్షణ):



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ పరిధిలోని బాల్కొండ మండల కేంద్రంలో ఉన్న ఢిల్లీ వరల్డ్ స్కూల్లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రియ మాట్లాడారు. తమ పాఠశాల ఏడాదిలోపు మూతపడుతుందంటూ కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ తరహా తప్పుడు ప్రచారాలతో తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. పాఠశాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని అనుమతులు ఉన్నాయని, సంబంధిత శాఖల నుంచి గుర్తింపులు పొందిన అనంతరమే విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. తమ పాఠశాల ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో ఎవరైనా అసత్య ప్రచారాలు చేస్తే, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు పుకార్లను నమ్మకుండా నేరుగా పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించి వాస్తవాలను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పాఠశాల యాజమాన్యం ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. మీ వద్ద పూర్తి సమాచారం (అనుమతులు, గుర్తింపు వివరాలు, సమావేశంలో పాల్గొన్న వారి పేర్లు) ఉంటే పంపండి. వాటిని కూడా జోడించి పూర్తి వార్తగా సిద్ధం చేస్తాను.

## లంచం తీసుకుంటూ బుక్కైన ఈఈ, ఏఈ..!

- రూ.60 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ వలలో చిక్కిన నీటిపారుదల శాఖ అధికారులు



అదిలాబాద్, జూలై 17 (జన సంఘర్షణ):
రాష్ట్రంలో అవినీతిపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగే అధికారుల ఆటకు చెక్ పెడుతూ వరుసగా ఉచ్చు బిగిస్తోంది. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో నీటిపారుదల శాఖకు చెందిన ఇద్దరు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు.

జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తన పౌల్ట్రీ ఫామ్ ఏర్పాటు కోసం నీటిపారుదల శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (చీూజ) కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయితే ఎన్‌వోసీ మంజూరు చేయాలంటే రూ.1 లక్ష లంచం ఇవ్వాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) రాథోడ్ విఠల్, అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) రమేశ్ డిమాండ్ చేశారు. బాధితుడు అంత మొత్తం ఇవ్వలేనని చెప్పడంతో చివరకు రూ.60 వేల వద్ద ఒప్పందం కుదిరింది.

లంచం ఇవ్వడానికి నిరాకరించిన బాధితుడు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆశ్రయించాడు. పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఆదిలాబాద్ నీటిపారుదల శాఖ కార్యాలయంలోనే బాధితుడి నుంచి రూ.60 వేల నగదు స్వీకరిస్తుండగా ఈఈ విఠల్, ఏఈ రమేశ్‌లను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**హెచ్చరిక:....**

"లంచం అడిగిన అధికారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దు... ఏసీబీకి సమాచారం ఇవ్వండి." లంచం ఇచ్చి పని చేయించుకోవడం కంటే, ఫిర్యాదు చేసి అవినీతిని అరికట్టడం గొప్ప పౌర బాధ్యత. ఈరోజు ఒక అవినీతి అధికారిని పట్టిస్తే, రేపు వందల మంది సామాన్య ప్రజలు దోపిడీ నుంచి రక్షించబడతారు.

"లంచానికి 'నో' చెప్పండి... నిజాయితీ సమాజ నిర్మాణానికి తోడ్పడండి."

## కోటగిరి గ్రామపంచాయతీ ఆవరణలో మెగా ఉచిత వైద్య శిబిరం

- సర్పంచ్ బర్ల మధుకర్ ఆధ్వర్యంలో నిర్వహణ

కోటగిరి/, జూలై 17 /(జన సంఘర్షణ):
కోటగిరి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం లయన్స్ క్లబ్, బోధన్ జనరల్ ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే 80 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అదనంగా బీపీ, షుగర్, ఈసీజీ తదితర వైద్య






పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహించి, వైద్యుల సలహాలు అందించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, కోటగిరి తహసీల్దార్ (ఎంఆర్వో) గంగాధర్, కోటగిరి ఎస్సై శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్, వైద్య బృందం, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఏన్కూరులో అక్రమ మెడికల్ షాప్‌పై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కొరడా..!

- లైసెన్స్ లేకుండా మందుల విక్రయం..
- దుకాణం సీజ్ - నిర్వాహకుడిపై కేసు నమోదు

ఏన్కూరు, జూలై 17 (జన సంఘర్షణ):
ఏన్కూరు మండలం బీఆరుప్పురం గ్రామంలో ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా మెడికల్ షాప్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ రెడ్డి నేతృత్వంలోని అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో మెడికల్ షాప్ నిర్వహణకు అవసరమైన లైసెన్స్, అనుమతి పత్రాలు చూపించాలని అధికారుల కోరగా, నిర్వాహకుడు ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు సమర్పించలేకపోయాడు. దీంతో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం ప్రకారం మెడికల్ షాపును అధికారులు సీజ్ చేశారు. అనంతరం షాప్ నిర్వాహకుడిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు





చేసి న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, అనుమతులు లేకుండా మెడికల్ షాపులు నిర్వహించడం ...తీవ్రమైన చట్టవిరుద్ధ చర్య అని స్పష్టం చేశారు. ఔషధాల విక్రయానికి అవసరమైన అన్ని లైసెన్సులు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తూ, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

**-హెచ్చరిక:.....**

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే అక్రమ మెడికల్ షాపులపై డ్రగ్ శాఖ ఉక్కుపాదం మోపుతోంది. లైసెన్స్ లేకుండా మందుల విక్రయం చేయడం చట్టరీత్యా నేరం. నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణం సీజ్‌తో పాటు క్రిమినల్ కేసులు కూడా తప్పవని అధికారులు స్పష్టం చేశారు.

## ఏన్కూరులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

- అనుమతులు లేకుండా మెడికల్ షాప్ నిర్వహణ
- దుకాణం సీజ్, నిర్వాహకుడిపై కేసు నమోదు....

ఏన్కూరు/ జులై 17(జన సంఘర్షణ)
ఏన్కూరు మండలం బీఆరుప్పురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా మెడికల్ షాప్ నిర్వహిస్తున్నట్లు సంబంధిత అధికారులకు సమాచారం అందింది. దీంతో డ్రగ్ ఇన్స్పెక్టర్ దేవేందర్ రెడ్డి నేతృత్వంలోని అధికారులు ఆకస్మికంగా మెడికల్ షాపును తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా మెడికల్ షాప్ నిర్వహణకు సంబంధించిన లైసెన్స్, అవసరమైన అనుమతి పత్రాలను చూపించాలని నిర్వాహకుడిని అధికారులు కోరగా, ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు సమర్పించలేకపోయినట్లు తెలిసింది. దీంతో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం ప్రకారం మెడికల్ షాపును అధికారులు సీజ్ చేశారు. అనంతరం షాప్ నిర్వాహకుడిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరచనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్స్పెక్టర్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా మెడికల్ షాపులు నిర్వహించడం చట్టవిరుద్ధమని, ఔషధాల విక్రయానికి అవసరమైన అన్ని లైసెన్సులు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే




వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి కేసు

- కానిస్టేబుల్ వెంకటేష్ అరెస్ట్

కొత్తగూడెం, జూలై 17 (జన సంఘర్షణ):
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సంచలనం రేపిన మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కేసులో ఏ-6 నిందితుడిగా ఉన్న బెటాలియన్ కానిస్టేబుల్ వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, మైనర్ బాలికను కొత్తగూడెం పాత డిపో ప్రాంతంలోని ఓ గదికి తీసుకెళ్లిన సమయంలో, ఆ గదిలో నిందితులకు ఆశ్రయం కల్పించినందుకు వెంకటేష్‌ను కేసులో ఏ-6 నిందితుడిగా చేర్చి అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై బాధితురాలి తల్లి జూలై 11, 2026న కొత్తగూడెం 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు



ప్రారంభించారు. దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు కానిస్టేబుల్ వెంకటేష్‌ను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు నిందితులను అరెస్ట్ చేసినట్లు, మిగిలిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

**- హెచ్చరిక**

"బాలలపై లైంగిక దాడులు సమాజం తలదించుకునే అత్యంత హేయమైన నేరాలు." మైనర్లపై లైంగిక వేధింపులు, దాడులు, వారికి ఆశ్రయం కల్పించడం లేదా నేరాన్ని దాచిపెట్టడం వంటి ప్రతి చర్య చట్టం ప్రకారం తీవ్రమైన నేరమే. నేరస్తుడు ఎంతటి హోదాలో ఉన్నా చట్టం ముందు అందరూ సమానమే. పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. అనుమానాస్పద ఘటనలు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వండి.

"చిన్నారి భద్రతే సమాజ భవిష్యత్తు... లైంగిక నేరాలకు సమాజం నుంచి సంపూర్ణ నిరాకరణ అవసరం."

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co